క్లుప్తంగా

నేడు పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం

మర్రిగూడ : నేడు మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి గ్రామపంచాయతీల అవార్డుల ప్రదానోత్సవానికి ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అవార్డుల ప్రదానోత్సవానికి మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చిట్యాల : మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సమిష్టి సేవా ఫౌండేషన్ వారు ఏఎస్ కన్‌స్ట్రక్షన్ సహకారంతో గురువారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉప సర్పంచ్ ఆవుల రమేష్, వార్డు సభ్యురాలు బోయపల్లి రజితవెంకన్న, పూర్వ విద్యార్థి మేడి ప్రేమ్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధి మేడి లింగస్వామి పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ



సిమెంట్ బెంచీలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నకిరేకల్ : లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని శ్రీ మైసమ్మ ఆలయానికి రెండు సిమెంట్ బెంచీలు, గంటను క్లబ్ అధ్యక్షుడు మారిడి చంద్రశేఖర్‌శెట్టి గురువారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌శెట్టి తన తల్లిదండ్రులు సూరప్ప–పెద్దమ్మ జ్ఞాపకార్థం గంట, ఒక సిమెంటు బెంచీ, ఒకటో వార్డు కౌన్సిలర్, ఆలయ నిర్మాణ ధర్మకర్త కందాల భిక్షంరెడ్డి తన తల్లిదండ్రులు లక్ష్మీ–గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఒక సిమెంట్ బెంచీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్తలు వీర్లపాటి నర్సింహారావు, గున్నాల వెంకట్‌రెడ్డి, చెవుగోని సైదులుగౌడ్, గున్నాల సైదిరెడ్డి, క్లబ్ ట్రెజరర్ కందాల వెంకట్‌రెడ్డి, యానాల రాంరెడ్డి, యన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ ధర్నా

నల్లగొండ : పెండింగ్ బిల్లులు, ఎయిడెడ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు ఎడ్ల సైదులు, తిరుమల, వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల..

నల్లగొండ టూటౌన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ వేతనాలు, కనీస వేతనం, ఇతర సమస్యలపై ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 562 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు గురువారం 562 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 13,781 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,219 మంది మాత్రమే హాజరయ్యారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కనగల్ : ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలకు బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. పగిడిమర్రి గ్రామానికి చెందిన పగిడిమర్రి యాదయ్య, జియడవల్లి గ్రామానికి చెందిన జంగాల దశరథ, చొప్పరి పెంటమ్మ, బోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన నీలకంఠం కృష్ణయ్యలు అనారోగ్యంతో మృతిచెందగా.. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున అందజేశారు. ఆయన వెంట బొమ్మకంటి లింగస్వామి, సీత నాగరాజు, సింగం సత్తయ్య, జక్కుల రవి, పోలే అనిల్, ఆవుల జానయ్య, శంకర్, నూనె సైదులు, నీలకంఠం రమేష్, కందుల లక్ష్మయ్య, రొయ్య వెంకన్న, గండి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

హుండీ లెక్కింపు

కేతేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో గల హుండీలో భక్తులు వేసిన నగదు కానుకలను గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అలుగుబెల్లి కేశవరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలానికి హుండీ ద్వారా ఆలయానికి రూ.12,800 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అలుగుబెల్లి జోగిరెడ్డి, పడాల గంగయ్య, చందా శ్రీనివాస్, చందా సైదులు, చందా నాగయ్య, అయితగోని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూత..



బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోరండ్ల శ్రీహర్షిత(ఫైల్)



అంపశయ్యపై పసిమొగ్గలు

సాక్షిలో ప్రచురితమైన కథనం

- తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల దీనగాథ వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'
- స్పందించి ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాతలు

కట్టంగూర్ : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తమ పిల్లలను కాపాడుకోవడానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఉన్న ఎకరం స్థలాన్ని అమ్ముకున్నారు ఆ దంపతులు. అయినా కూడా పిల్లలకు నయం కాలేదు. వైద్యం చేయించడానికి చేతిలో నయాపైనా లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు ఆ నిరుపేద కుటుంబం వారు. వారి దీనగాథ 'అంపశయ్య పై పసిమొగ్గలు' అనే శీర్షికతో 2021 జనవరి 3న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో దాతలు భారీగా స్పందించడంతోపాటు పెద్ద మొత్తంలో ఆర్థికసాయం అందజేశారు. కట్టంగూర్‌కు చెందిన పోరెండ్ల వీరస్వామి 2007 ఏప్రిల్‌లో సూర్యాపేటకు చెందిన మంజులను వివాహం చేసుకున్నాడు. వీరస్వామి నాయనమ్మ.. మంజుల అమ్మమ్మ సొంత అక్కాచెల్లెళ్లు. వీరస్వామి–మంజుల దంపతులకు 2008 సంవత్సరంలో యశ్వస్, 2010లో శ్రీహర్షిత జన్మించారు. యశ్వస్‌కు తరుచూ జ్వరం రావడంతోపాటు, నీరసంగా ఉండేది. శ్రీహర్షితకు కూడా అవే లక్షణాలు రావడంతో సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాదు ఆస్పత్రుల్లో పిల్లల స్పెషలిస్టుల వద్ద చూపించి మందులు వాడారు. అయినా ఫలితం లేకుండా పోయింది. బాబుకు రెండున్నర సంవత్సరాల వయస్సులో, పాపకు ఆర్నెళ్ల వయస్సులో తలసేమియా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఎముక మూలగ (బోన్‌మ్యారో)లో హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్తకణాలు నిలిచిపోవడంతో తలసేమియా వ్యాధి వస్తుంది.

బెంగళూరులో చికిత్స..

తమ ఇద్దరి పిల్లలకు చికిత్స చేయించేందుకు ప్రతి నెలలో రెండుమార్లు (15 రోజులకు ఒకసారి) హైదరాబాదుకు వెళ్లి పిల్లల శరీరంలో ఎర్ర రక్తకణాలు పెంచడానికి రక్తం ఎక్కించుకుని వచ్చేవారు ఆ దంపతులు. వైద్య ఖర్చులకు, బస్సు చార్జీల నిమిత్తం ప్రతినెలా రూ.10 వేల నుంచి రూ.15వేలు ఖర్చు పెట్టేవారు. దాతల ఆర్థికసాయంతో 2022 జూలై 29న బెంగళూరులో పాపకు శస్త్ర చికిత్స చేశారు. ఇద్దరిలో శ్రీహర్షితకు తల్లి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ మ్యాచ్ కావడంతో బెంగళూరు వైద్యులు చికిత్స చేశారు. ప్రస్తుతం నెలకొకసారి మందుల కోసం బెంగళూరుకు ప్రయాణం చేస్తున్నారు. యశ్వస్‌కు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ దాత దొరకకపోవడంతో ఆపరేషన్ కాలేదు. వారి దీనగాథకు స్పందించిన మంత్రి కేటీఆర్ డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఒక గుంట స్థలానికి సంబంధించిన పట్టా పత్రాలను స్థానిక రెవెన్యూ అధికారులు అందజేశారు. త్వరలో డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టించేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

సాక్షికి రుణపడి ఉంటాం



తలసేమియా వ్యాధితో బాధపడుతున్న మా పిల్లలకు సాక్షి కథనం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. కథనానికి స్పందించిన పాఠకులు, నా తోటి స్నేహితులు, దాతలు బంధువులు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మా ఇద్దరు పిల్లల్లో శ్రీహర్షితకు ఆపరేషన్ పూర్తి అయ్యింది. సాయం చేసిన ప్రతి ఒక్కరికీ, సాక్షికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

– పోరెండ్ల వీరస్వామి, చిన్నారి తండ్రి కట్టంగూర్

అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం



నార్కట్‌పల్లి : సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : కేంద్ర ప్రభుత్వ తీరును సీఎం కేసీఆర్ ప్రశ్నించినందుకే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. మండలంలోని 26 మందికి మంజూరైన రూ.16 లక్షల 56 వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చిట్యాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎమ్మెల్సీ కవితపై కేంద్ర ప్రభుత్వం ఈడీ కేసులు నమోదు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన చిట్యాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.లాజర్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, నాయకులు కర్నాటి ఉప్పల వెంకట్‌రెడ్డి, గుండెబోయిన సైదులు, వనమా వెంకటేశ్వర్లు, పొన్నం లక్ష్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఈ నెల 25, 31 తేదీల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

నార్కట్‌పల్లి : ఈ నెల 25, 31వ తేదీల్లో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. గురువారం నార్కట్‌పల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 25వ తేదీన జువ్విగూడెం గ్రామంలో 14 గ్రామ పంచాయతీలకు, 31న నార్కట్‌పల్లి మండల కేంద్రంలో 15 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు అధిక నిధులు కేటాయిస్తున్న కేసీఆర్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయిస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు వివిధ విభాగాల్లో మంజూరైన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు అవార్డు రావడం శుభపరిణామం అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సర్పంచులు దూదిమెట్ల స్రవంతి, మేడి పుష్పలత శంకర్, నూకల శంకర్, దాసరి రాజు, బాలకృష్ణ, నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల్లో విటమిన్లు అధికం



నల్లగొండలోని 44వ వార్డులో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రణతి

నల్లగొండ టూటౌన్ : చిరు ధాన్యాల వాడకంతో మినరల్స్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రణతి అన్నారు. నల్లగొండ పట్టణంలోని 44వ వార్డు కమ్యూనిటీ హాల్‌లో గర్భిణులకు గురువారం నిర్వహించిన పోషన్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఖాజా సైదొద్దీన్, అంగవాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

మర్రిగూడ : పోషణ్ అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని తమ్మడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో శరీరానికి కావాల్సిన మినరల్స్, విటమిన్స్ పుష్కలంగా లభిస్తాయని అన్నారు. రాగి పిండితో జావ, లడ్డూలు తయారు చేసుకున్నట్లయితే బాలింతలకు ఎంతో ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని అడవితుమ్మలపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ, సర్పంచ్ చెన్నయ్య, ఎంపీటీసీ సరితకిరణ్, అనుదీప్, ప్రసన్నబాబు, నాగలక్ష్మీ తదితరులు ఉన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి



నకిరేకల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

నకిరేకల్ : స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా నకిరేకల్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అంబటి చిరంజీవి, మామిడోజు వెంకటేశ్వర్లు, బుడిగె శ్రీను, బొడ్డు సతీష్, గద్దపాటి శంకర్, రమేష్, పిట్టల అనిల్, పసుపులేటి సోమయ్య, అంబటి నవీన్, చెరుకు సైదులు, శేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె.షరీఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దుబ్బ విగ్నేశ్వర్, రావుల శివకుమార్, లతీఫ్, అన్వర్, అంజయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఏఐవైఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ఉరిపక్క వెంకటయ్య, ఇస్కిళ్ల మహేందర్, గిరి, స్వామి, ప్రశాంత్, మైలారపు గిరిష్, రామలింగాచారి, కృపాచారి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి : మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కొమ్ము లక్ష్మయ్య, కొప్పెర లక్ష్మయ్య, రవితేజ, కళ్యాణ్, రేవంత్, సుహాసిని, మణిక, జోత్స్న తదితరులు ఉన్నారు.

'డెవిల్'తో చేపలకు ముప్పు !

- చిట్యాల మండలంలోని చెరువుల్లో ప్రత్యక్షం
- గతంలోనే ఈ చేపలపై నిషేధం విధించిన ప్రభుత్వం
- రవ్వ, బొచ్చ వంటి చేపల పెరుగుదలపై ప్రభావం



పెద్దకాపర్తిలో మత్స్యకారుల వలలకు చిక్కిన డెవిల్ ఫిష్‌లు



పెద్దకాపర్తిలో వలలకు చిక్కిన డెవిల్ ఫిష్‌లను చూపుతున్న మత్స్యకారులు

చిట్యాల : అక్వేరియంలలో అలంకరణకు పెంచే డెవిల్ ఫిష్‌లు(దెయ్యం చేప) ఇప్పుడు చెరువుల్లో ప్రత్యక్షం అవుతున్నాయి. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని పెరిగే డెవిల్ ఫిష్ మూసీ పరివాహక చెరువుల్లో కూడా పెరుగుతుండడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డెవిల్ ఫిష్‌లు చెరువుల్లో పెరుగుతుండడంతో ఇతర చేపలు మనుగడ సాధించలేక మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. డెవిల్ ఫిష్‌లు ఇప్పుడు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని పెద్ద చెరువులో సైతం వేలాదిగా పెరుగుతున్నాయి.

వలల్లో చిక్కుతున్న డెవిల్ ఫిష్‌లు..

గత ఏడాది వర్షాకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని పెద్ద చెరువులోకి ఆ గ్రామ మత్స్య కార్మిక సంఘం ప్రతినిధులు వదిలారు. కాగా గురువారం ఆ చేపలను పట్టేందుకు వలలు విసరగా డెవిల్ ఫిష్(దెయ్యం చేపలు)లు చిక్కాయి. ఇలా వందలాది డెవిల్ ఫిష్‌లు వలలకు చిక్కడంతో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. మరోవైపు చెరువుల్లో వదిలిన రవ్వ, బొచ్చ, బురద మట్ట వంటి చేపలు పెరగాల్సిన సైజులో పెరగలేదు. ఈ డెవిల్ ఫిష్‌లు ఇతర చేపలను తినడంతోపాటు ఇతర చేపలకు వేసే మేతను కూడా తినేస్తున్నాయి. ఈ చెరువుపై సుమారు వంద మంది మత్స్యకారులు ఆధారపడి ఉన్నారు. చెరువుల్లో ఆదాయాన్నిచ్చే చేపలు పెరగకపోవడంతోపాటు నిషేధిత, అనారోగ్యం కలిగించే డెవిల్స్ ఫిష్‌లు పెరగడం పట్ల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెవిల్ ఫిష్‌ల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

డెవిల్ ఫిష్‌లపై నిషేధం..

ప్రతికూల పరిస్థితుల్లో అతి వేగంగా, అతి బరువుగా పెరిగే ఈ డెవిల్ ఫిష్ పెంపకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ రకం చేప చెరువులోకి ఒక్కటి చేరినా అతి స్వల్ప కాలంలో ఆ చెరువులో అర టన్ను డెవిల్ ఫిష్ పిల్లలను పునరుత్పత్తి చేస్తుంది. ఈ చేపల నివారణకు ఇప్పటివరకు ప్రత్యేక మందులు లేవు. డెవిల్ ఫిష్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ చెరువుల్లో చేపల పెంచే వ్యాపారులు తమ వలలకు చిక్కిన ఈ చేపలను హైదరాబాద్ వంటి పట్టణాల్లోని హోటళ్లకు వాహనాల్లో రవాణా చేస్తున్నారు. ఇలా చిట్యాల మండల పరిధిలోని హైవే రోడ్డుపై పలుమార్లు డెవిల్ ఫిష్‌లు రవాణా చేస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేసిన ఘటనలు ఉన్నాయి.

మత్స్యకారులను ఆదుకోవాలి



మా పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేయగా డెవిల్ ఫిష్‌లు చిక్కాయి. ఈ డెవిల్ ఫిష్‌లు చెరువులో పెరగడంతో ఇతర చేపలు అనుకున్న సంఖ్యలో పెరగలేదు. దీంతో ఈ చెరువుపై ఆధారపడిన వంద మత్స్యకారుల కుటుంబాలు నష్టపోతున్నాయి. ఈ డెవిల్ ఫిష్‌లు ప్రతియేటా చెరువుల్లోకి వచ్చి చేరుతున్నాయి. డెవిల్ ఫిష్‌ల నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని మత్స్యకారులను ఆదుకోవాలి.

– బుంగపట్ల తిమ్మయ్య, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు, పెద్దకాపర్తి

జన చైతన్య యాత్రను జయప్రదం చేయండి



నకిరేకల్ : మాట్లాడుతున్న కందాల ప్రమీల

నకిరేకల్ : జన చైతన్య యాత్రలో భాగంగా ఈ నెల 27న నకిరేకల్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా నాయకురాలు కందాల ప్రమీల తెలిపారు. గురువారం నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ, మండల కార్యదర్శులు వంటెపాక వెంకటేశ్వర్లు, రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు మర్రి వెంకటయ్య, సాకుంట్ల నర్సింహ, తాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రలో భాగంగా ఈ నెల 26, 27,28 తేదీల్లో మిర్యాలగూడ, నల్లగొండ నకిరేకల్, చిట్యాలలో నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. చండూర్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, నాయకులు పోలే సాంబయ్య, పిట్టల వెంకన్న, సాయం కృష్ణయ్య, ఎస్ నరసింహ, బి సుమన్ పాల్గొన్నారు.

కనగల్ : ఈ నెల 27న సీపీఎం ఆధ్వర్యంలో జరిగే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలు నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం మూడు బృందాలుగా మార్చి 17నుంచి 29వరకు బస్సు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 27న నల్లగొండకు యాత్ర బృందం వస్తున్న సందర్భంగా ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై యాత్రను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కందుల సైదులు, కానుగు లింగస్వామి, ఎండీ అక్రం, శివలీల తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆ గ్రామ సర్పంచ్ నందిపాటి రాధరమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, సీహెచ్ఓ కె.రమాదేవి, ఏఎన్ఎం రాధ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని రైతు బంధు సమితి జిల్లా సభ్యులు కోడి వెంకన్న గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిలుకూరి రాధిక శ్రీనివాస్, కల్లెట్ల మారయ్య, సాయిప్రకాష్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో 12, 41, 43వ వార్డుల్లోని కంటి వెలుగు శిబిరాలను మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్ యాదవ్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఈఈ రాములు, డీఈలు అశోక్‌కుమార్, వెంకన్న, నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

నల్లగొండ టూటౌన్ : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు బీజేపీ కిసాన్ మోర్చా నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి 15 రోజుల్లోగా నివేదిక తయారు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు ఇవ్వాలని కోరారు. మునుగోడు నియోజకవర్గంలో మామిడి, కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు మంత్రి శ్రీనివాస్, సీతారాంరెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాసోజు యాదగిరిచారి, బీపంగి జగ్జీవన్‌రామ్, కె.శ్రీదేవి, నీరజ తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్టుకు నిరసనగా ధర్నా



ధర్నాలో పాల్గొన్న చెరుకు లక్ష్మి

నకిరేకల్ : తీన్మార్ మల్లన్న అరెస్టుకు నిరసనగా నకిరేకల్‌లో తెలంగాణ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకురాలు చెరుకు లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న ప్రశ్నించే వారిపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. ప్రశ్నించేవారి గొంతును బీఆర్‌ఎస్ ప్రభుత్వం నొక్కుతోందని అన్నారు. మల్లన్నను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ జిల్లా కార్యదర్శి జిల్లా సంపత్, ప్రవీణ్, ఉమేష్, వేముల సాయి, శివరాం, పాలడుగు శివ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న చిన్నారి ప్రీతిక

శాలిగౌరారం : మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన రాచమల్ల వీరయ్య–పరమేశ్వరి దంపతుల కుమార్తె ప్రీతిక తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తన సహచర విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, ఇతర సామగ్రి అందజేసింది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాదూరి శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎర్ర కృష్ణమోహన్, బొమ్మగాని రవి, చింటూ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కుమారస్వామి

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని ఎల్‌పీటీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ జనరల్ నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల రంజిత్, ఇరిగేషన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, జిల్లా అధ్యక్షుడు పొన్నగంటి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నిరంజన్, నాయకులు హరిదీప్‌రెడ్డి, శ్రీకాంత్, సుజాత, అజయ్‌కుమార్, గోపాల్, ఉషశ్రీ, కేశవరావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీపై కక్ష సాధిస్తున్న కేంద్రం'

కేతేపల్లి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎదుర్కోలేక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పరువు నష్టం కేసులు బనాయించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. గురువారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయని అన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని కేసుల పేరుతో వేధించడం తగదన్నారు.